

రేపు పెద్దకొడప్గల్‌లో సీవోఈ ప్రవేశ పరీక్ష

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 2: ఉన్నత విద్య ప్రవేశాల కోసం నిర్వహించే సీవోఈ ప్రవేశ పరీక్ష ఆదివారం నిర్వహించబడుతుందని పెద్ద కొడప్‌గల్ గురుకుల పాఠశాల చీఫ్ సూపరింటెండెంట్ మీనాక్షి తెలిపారు. ఉన్నత విద్య కోసం నిర్వహించే ఈ ప్రవేశ పరీక్షకు చాలా మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని వారందరూ ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని సూచించారు. అయితే పెద్ద కొడప్‌గల్ గురుకుల పాఠశాలలో సెంటర్ ఉన్నదని విద్యార్థుల హాల్ టికెట్లపై చిన్న తక్కడ్‌పల్లి సెంటర్ అని ఉంటుందని, ఈ విషయాన్ని విద్యార్థులు గమనించి పెద్ద కొడప్‌గల్ గురుకుల పాఠశాలకు రావాలని సూచించారు.



ఊరిస్తున్న నామినేటెడ్ పదవులు



- నామినేట్ పోస్టుల భర్తీకి కాంగ్రెస్ కసరత్తు
- కార్పొరేషన్ చైర్మన్‌లపైనే ముఖ్యనేతల దృష్టి
- జిల్లా, మండల స్థాయి పదవులపై ద్వితీయ శ్రేణి నేతల ఆశలు
- పదవుల కోసం ముఖ్య నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో ఆశావహులు
- జిల్లాలో ఇప్పటికే పలు మార్కెట్ కమిటీ పాలకవర్గాల రద్దు

కామారెడ్డి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ కాంగ్రెస్‌లో నామినేట్ పోస్టులు నేతలను ఊరిస్తున్నాయి. నామినేట్ పోస్టుల కోసం ఆ పార్టీలోని ఆశావహులు పోటీ పడుతున్నారు. సుదీర్ఘకాలంగా పార్టీనే నమ్ముకుని పని చేయడం స్థానిక నేతలను గెలిపించుకున్న వారికి నామినేట్ పదవుల్లో ప్రాధాన్యత ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి ఇది వరకే ప్రకటించారు. పార్లమెంట్ ఎన్నికల ముందే నామినేట్ పదవులను కేటాయించే పనిలో పార్టీ అధిష్ఠానం ఉంది. ఈ నేపథ్యంలో కొందరు నేతలు నామినేట్ పదవుల కోసం ప్రజా ప్రతినిధులను ప్రసన్నం చేసుకుంటున్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అందరి సేవలు వినియోగించుకునే దిశగా సీఎం అడుగులు వేస్తున్నాడు. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కష్టపడిన వారంతా నామినేట్ పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల్లో చాలా మంది ముఖ్యనేతలు ఉన్నారు. వీరంతా కార్పొరేషన్ పదవులను ఆశిస్తుండగా ద్వితీయ శ్రేణి క్యాడర్ జిల్లా, మండల స్థాయి పదవులు వస్తాయని భావిస్తున్నారు.

కార్పొరేషన్‌ల వైపు పలువురు నేతల చూపు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలు కార్పొరేషన్ పదవులవైపు చూస్తున్నారు. కాంగ్రెస్ జిల్లా, రాష్ట్రస్థాయి పదవుల్లో కొనసాగుతున్న వారు ఏదైన కార్పొరేషన్ పదవులను దక్కించుకోవాలని భావిస్తున్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో గత ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. రేవంత్‌రెడ్డి కోసం తీవ్రంగా పని చేసిన పలువురు ముఖ్యనేతలకు కార్పొరేషన్ పదవులపై హామీ ఇచ్చినట్లు పార్టీ వర్గాల్లో చర్చసాగుతుంది. అదేవిధంగా ఎల్లారెడ్డి, జుక్కల్ నియో జకవర్గాల్లో కాంగ్రెస్ కైవసం చేసుకోవడంతో స్థానిక ఎమ్మెల్యేలు సైతం తన అనుచరవర్గానికి ఏదైన ముఖ్యమై న నామినేట్ పదవిని అప్పగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఖాళీగా ఉన్న కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో ఏదో ఒకటి ఇప్పించమని ఆశావహులు ప్రజాప్రతినిధుల ను కోరుతున్నారు. రాష్ట్రస్థాయిలో పదవులు దక్కని పక్షంలో జిల్లా స్థాయిలోనైన ఇప్పించమని కోరుతున్నట్లు సమాచారం.

జిల్లా గ్రంథాలయంతో పాటు మార్కెట్, దేవాలయ కమిటీలు

దశాబ్దాల కాలంగా అధికారంలో లేక పదవులు పొందలేక, పనులు చేయలేక అవస్థలు పడ్డ కాంగ్రెస్ పార్టీలోని ద్వితీయ శ్రేణి నేతలను జిల్లా, మండల స్థాయి నామినేట్ పోస్టులు ఆశలు రేకెత్తిస్తున్నాయి. కాంగ్రెస్ అధిష్ఠానం ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నేతలను జిల్లా, నియోజకవర్గ స్థాయిలో వివిధ సంస్థల్లో నామినేట్ చేసేందుకు కసరత్తు చేస్తోంది. జిల్లాలో గ్రంథాలయ సంస్థ, పది వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఇప్పటికే జిల్లా గ్రంథాలయ పాలకవర్గాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌తో పాటు డైరెక్టర్ల పదవులకు పలువురు కాంగ్రెస్ నేతలు పోటీ పడుతున్నారు. ఒక్కో దానిలో చైర్మన్, వైస్ చైర్మన్‌లతో పాటు మరో 12 మంది డైరెక్టర్‌లను నియమించాల్సి ఉంటుంది. అంటే ఒక్కో మార్కెట్ కమిటీలో 14 మందికి అవకాశం దక్కుతుంది. కామారెడ్డి నియోజకవర్గంలో కామారెడ్డి, భిక్కనూర్ మార్కెట్ కమిటీలు ఉండగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో సదాశివనగర్, గాంధారి, ఎల్లారెడ్డి, బాన్సువాడ నియోజకవర్గంలో బాన్సువాడ, బీర్కూర్, జుక్కల్ నియోజకవర్గంలో పిట్లం, మద్నూర్, బిచ్కుంద మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఈ మార్కెట్ కమిటీలో నామినేట్ పోస్టులతో భర్తీ చేస్తే కాంగ్రెస్‌లోని వంద మందికి పైగా పదవులు పొందే అవకాశం ఉంది. వీటితో పాటు జిల్లాలోని పలు ఆలయ కమిటీలను నామినేట్ చేస్తారు. చైర్మన్‌తో పాటు డైరెక్టర్‌లు ఉంటారు.

లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా..

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని దక్కించుకోవాలని కాంగ్రెస్ టార్గెట్‌గా పెట్టుకుంది. షెడ్యూల్ వచ్చేలోపు నామినేట్ పదవుల భర్తీకి కాంగ్రెస్ కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. కామారెడ్డి జిల్లా జహీరాబాద్ లోక్‌సభ పరిధిలో ఉంది. పార్టీ కోసం పాటుపడిన వారికి నామినేట్ పదవులు కట్టబెట్టి ఈ ఎన్నికల్లో సేవలు వినియోగించుకోవాలని పార్టీ భావిస్తోంది. రాష్ట్ర స్థాయిలో 54 కార్పొరేషన్ పదవులు ఉన్నాయి. జిల్లా స్థాయిలో గ్రంథాలయ సంస్థ చైర్మన్, రైతు సమన్వయ కమిటీ, ఆత్మ కమిటీ, మార్కెట్ కమిటీలు ఆలయ కమిటీ చైర్మన్, డైరెక్టర్ పోస్టులు ఉన్నాయి. కామారెడ్డి జిల్లాలో ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలుగా మదన్ మోహన్‌రావు, లక్ష్మీకాంతరావులు కొనసాగుతున్నారు. కామారెడ్డి నియోజకవర్గం నుంచి ముఖ్యనేతగా ఉన్న షబ్బీర్‌అలీకి ఇటీవల క్యాబినెట్ హోదాతో ప్రభుత్వ సలహాదారు పదవిని కట్టబెట్టారు. బాన్సువాడ ఇన్‌చార్జీగా ఏనుగు రవీందర్‌రెడ్డి కొనసాగుతున్నారు. అయితే కార్పొరేషన్ పదవులతో పాటు జిల్లా మండల స్థాయి నామినేట్ పోస్టుల కోసం ఆశావహులు ఎవరికి వారే తమ నేతలను కలుస్తూ ప్రయత్నాలు చేస్తున్నారు.

బస్వాపూర్ డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద ఉద్రిక్తత


డబుల్ బెడ్‌రూం ఇళ్లకు తాళం వేస్తున్న రెవెన్యూ సిబ్బంది

- రాత్రికి రాత్రే ఇళ్లలోకి ప్రవేశాలు చేసిన పలువురు
- అర్హులు కాకుండా అనర్హులు కబ్జా చేశారని ఆందోళన
- డబుల్ బెడ్‌రూం ఇళ్లకు తాళాలు వేయించిన తహసీల్దార్

భిక్కనూరు, ఫిబ్రవరి 2: గత ప్రభుత్వంలో నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్లు పూర్తయినా ఇప్పటికీ పంపిణీ చేయకపోవడంతో గ్రామాల్లో ఆందోళన కార్యక్రమాలు మొదలయ్యాయి. గతంలో గుర్తించిన అర్హులకు కాకుండా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వేరేవారికి వీటిని కేటాయిస్తారని వస్తున్న వదంతులతో గ్రామాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. గత ఆరు రోజుల క్రితం మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో నిర్మించి డబుల్ బెడ్‌రూం ఇళ్ల తాళాలను పగులగొట్టి కొందరు ప్రవేశాలు చేసిన సంఘటన మరువకముందే మండలంలోని బస్వాపూర్ గ్రామంలో గురువారం రాత్రి అదేతరహ సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే.. గ్రామ శివారులో పెద్దమల్లారెడ్డి గ్రామానికి వెళ్లే దారిలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లలోకి గురువారం రాత్రి అర్హులు కాకుండా మిగతావారు వెళ్తున్నారని పుకార్లు వ్యాపించడంతో గతంలో గుర్తించిన అర్హులే కాకుండా మిగతావారు సైతం పెద్దఎత్తున అక్కడికి చేరుకుని ఏది ఖాళీ ఉంటే ఆ గది తాళం పగుళగొట్టి స్వాధీనం చేసుకున్నారు. వాస్తవానికి అక్కడ 50 డబుల్ బెడ్‌రూం ఇళ్లను బస్వాపూర్, సిద్ధరామేశ్వరనగర్ గ్రామాలకు సంబంధించి నిర్మించగా బస్వాపూర్ గ్రామస్థులే అన్నింటిని స్వాధీన పర్చుకున్నారు. దీంతో గతంలో అధికారులు గుర్తించిన అర్హులకు, అనర్హులకు తీవ్ర వాగ్వాదం, గొడవలు చోటు చేసుకున్నాయి. శుక్రవారం ఉదయం బస్వాపూర్, సిద్ధరామేశ్వరనగర్ గ్రామాలకు చెందిన కొందరు తహసీల్దార్ శివప్రసాద్‌కు సమాచారం అందివ్వగా వెంటనే అక్కడికి చేరుకుని డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి ఎలాంటి అనుమతులు లేకుండా చొరబడటం నేరమని వెంటనే ఖాళీ చేయాలని ఆదేశించారు. దీంతో కొందరూ చేసేదేమిలేక ఖాళీ చేయగా మరికొందరు ఖాళీ చేయలేదు. దీంతో తహసీల్దార్ 50 తాళాలను తెప్పించి అన్నింటికీ తాళాలు వేశారు. ఈ మేరకు తహసీల్దార్ మాట్లాడుతూ గత నెలలో పెద్దమల్లారెడ్డిలో ఇలాంటి సంఘటననే జరిగిందని అక్కడ వారందరినీ ఖాళీ చేయించి వాచ్‌మెన్‌ను నియమించామన్నారు. బస్వాపూర్‌లో సైతం అన్ని గదులకు తాళాలు వేశామన్నారు. వాటిని పగుల గొట్టితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు, వాచ్‌మెన్‌ను సైతం ఏర్పాటు చేస్తామన్నారు.

ఎరువులు, విత్తనాల డీలర్లు
వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలి

కలెక్టర్ జితేష్ వి. పాటిల్

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 2: ఎరువులు, విత్తనాలు విక్రయించే డీలర్లు వ్యవసాయరంగంపై అవగాహన కలిగి ఉండాలని అప్పుడే రైతులకు నాణ్యమైన మేలు రకం వాటిని అందించవచ్చని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి డివిజన్‌లోని 40 మంది విత్తన, పురుగుల మందులు, ఎరువులు విక్రయించే ఇన్‌పుట్ డీలర్లకు 48 వారాల పాటు నిర్వహించిన వ్యవసాయ విస్తరణ సేవ డిప్లొమా కోర్సులో ఉత్తీర్ణులైన వారితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడారు. విక్రయదారులకు వ్యవసాయరంగంపై అవగాహన కలిగి ఉన్నప్పుడే రైతులకు సరైన మందులు అందించి మెలుకువలు తెలుపగలుగుతారని అన్నారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన మన జిల్లాలో రైతులకు లాభసాటి వ్యవసాయంగా శాస్త్ర, సాంకేతిక పద్ధతులు అవలంబించుటపై అవగాహన కలిగించాలని తెలిపారు. సంపాదించడానికి ఎన్నో అవకాశాలున్నాయని, విక్రయాలు పెంచాలనే ఉద్దేశ్యంతో రైతులను మోసగించవద్దని కోరారు. వివిధ రకాల పంటలు పండించుట, లేబర్‌ను అధిగమించుటకు డ్రోన్ వంటి టెక్నాలజీ వినియోగించుట, పంటలకు రోగాలు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించాలన్నారు. ఈ నెలలో ఎల్లారెడ్డి డివిజన్‌లో మిగిలిన విక్రయదారులతో పాటు బాన్సువాడ, బిచ్కుంద డివిజన్‌లో 40 మంది చొప్పున డిప్లొమా కోర్సులో శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు రత్న, భారతి, లక్ష్మీ ప్రసన్న, సునీతరాణి, హరీశ్‌కుమార్, శ్రీకాంత్, అనిల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.


వ్యవసాయ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఓటింగ్ మిషన్‌పై అవగాహన కలిగి ఉండాలి

ఓటింగ్ మిషన్ ద్వారా ఓటు వేసే విధానంపై ఓటర్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఈవీఎం ప్రదర్శన కేంద్రాన్ని బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్‌ల పనితీరును పరిశీలించి యంత్రాల నిర్వహణకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపా రు. ఈవీఎంల ద్వారా ఓటు వేయుటపై అవగాహన పెంపొం దించేందుకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో డెమో ప్రదర్శిస్తున్నా మని అన్నారు. మొబైల్ వాహనం ద్వారా కూడా డెమో ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఓటర్లు కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్ అంటే ఏమిటో తెలుసు కోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సూప రింటెండెంట్ ప్రవీణ్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌కుమార్, ఇందిరా ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

వెట్టి చాకిరీ ఇంకెన్నాళ్లు!?

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్తున్న ఆర్‌పీలు

- మెప్మా రిసోర్స్ పర్సన్‌లకు 8 నెలలుగా అందని జీతాలు
- పని బారెడు వేతనం మూరెడు
- ప్రభుత్వం నుంచి వచ్చేది రూ.4 వేలు మాత్రమే
- మరో రూ.2 వేలు మహిళా సంఘాల నుంచి
- జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో 94 మంది ఆర్‌పీలు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 2: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ పథకాలు తీసుకువచ్చినా మున్సిపాలిటీల్లోని ప్రజలకు అందించే ఆర్‌పీలు ఆర్థిక కష్టాలతో నానా అవస్థలు పడుతున్నారు. ఇంత చేస్తున్నా తమకు అందించే జీతం మాత్రం మూరేడే ఇస్తూ బారెడు పనిని చేయిస్తున్నారని వాపోతున్నారు. పోనీ ప్రభుత్వం అందించే ఆ మూరెడు జీతాలైనా నెలనెలకు అందిస్తున్నారా అంటే అదీ లేదని గత 8 నెలలుగా వేతనాలు అందడం లేదని ఆర్‌పీలు పేర్కొంటున్నారు. ప్రభుత్వ పథకాలు, ఎన్నికల విధులు, మహిళా సంఘాలకు సంబంధించిన పనులన్నింటిని ఆర్‌పీలే చేస్తున్నారు. అయినప్పటికీ వారికి నెలనెల వేతనాలు అందని పరిస్థితి నెలకొనడంతో తమ కుటుంబాలు గడవక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆర్‌పీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీల్లో మొత్తం 94 మంది పని చేస్తున్నారు. ఇందులో కామారెడ్డిలో 62, ఎల్లారెడ్డి 10, బాన్సువాడలో 22 మంది ఆర్‌పీలు ఆయా మున్సిపల్ వార్డుల పరిధిలో మహిళా సమైఖ్యలో తమ విధులను నిర్వహిస్తున్నారు. మున్సిపాలిటీల్లో ఎస్‌హెచ్‌జీ, ఎస్‌ఎల్‌ఎఫ్, టీఎల్‌ఎఫ్‌లకు బుక్ కీపింగ్, మహిళలకు బ్యాంకు రుణాలు, స్త్రీనిధి నుంచి రుణాలను ఇప్పించడం ఆ రుణాలను సకాలంలో చెల్లించేలా చేయడం, వీధి వ్యాపారులను గుర్తించి వారి వ్యాపారాభివృద్ధికి రుణాలు మంజూరు చేయిస్తారు. అలాగే వీరిని ఆన్‌లైన్‌లో చేర్చి వెండర్స్ కార్డులను ఇప్పించడం, వారు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించేలా చూస్తారు. దీంతో పాటు ప్రభుత్వం చేపట్టే హరిత హారం, పట్టణ ప్రగతి, తడి-పొడి చెత్తను వేరు చేయు విధానం, తడి చెత్తతో కంపోస్టు తయారు చేయు విధానం, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఫోన్ ద్వారా ఫీడ్ బ్యాక్ తీసుకోవడం, వ మున్సిపాలిటీ ని ఓడీఎఫ్‌గా మార్చడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఇంటింటికీ తిరిగి మరుగుదొడ్ల నిర్మాణాలపై అవగాహన, అనాథ పిల్లల సర్వే, బతుకమ్మ చీరల పంపిణీ, ఇంటింటి సర్వే తదితరాల్లో ఆర్‌పీలు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమం విజయవంతం చేయడంలో, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న విశ్వకర్మలకు ఆర్థిక లబ్ధి చేకూర్చేందుకు అందించే పథకం కోసం పని చేస్తున్నారు. ఇలా ప్రభుత్వాలు ఏ పథకాలు తీసుకువచ్చినా అమలుకు శాయశక్తులా ప్రయత్నం చేస్తూ వెట్టి చాకిరికి గురవుతున్నామని వాపోతున్నారు. అధికారులకు వినతులు ఇచ్చినా తమను పట్టించుకోడం లేదని ఆర్‌పీలు వాపోతున్నారు. కొత్త ప్రభుత్వమైనా స్పందించి తమకు జీతాలు పెంపుతో పాటు నెలనెల జీతాలు చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.

చాలీచాలని వేతనం

ఆర్‌పీలకు నెలకు ప్రభుత్వం నుంచి అందే వేతనాలు రూ.4 వేలు, మహిళా సమాఖ్య ద్వారా మరో రూ.2 వేలు చెల్లిస్తుంటారు. కానీ ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.4 వేలు 8 నెలలుగా అందడం లేదు. గత ప్రభుత్వం రూ.4వేల జీతానికి బదులుగా రూ.6 వేలను అందిస్తామని ప్రకటించినా అమలు చేయలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ పథకం తీసుకువచ్చినా పట్టణ ప్రజలకు చేరువ చేసేందుకు తమతో పనులు చేయించడంలో చూపుతున్న శ్రద్ధ తమ జీతాలు చెల్లించడంలో మాత్రం చూపడం లేదని విమర్శలు ఆర్‌పీల నుంచి వ్యక్తం అవుతున్నాయి. ఎన్ని ప్రభుత్వాలు మారినా తమ బతుకులు మాత్రం మారడం లేదని ఆర్‌పీలు పేర్కొంటున్నారు. చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నా ఆ వేతనాలను సైతం నెలల తరబడి ఆపడంపై మండిపడుతున్నారు.


అధికారుల సమీక్షలో పాల్గొన్న ఆర్‌పీలు (ఫైల్)

8 నెలలుగా జీతాలు లేవు

- భారతి, ఆర్‌పీల జిల్లా అధ్యక్షురాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చే ప్రతీ పథకాన్ని పట్టణ ప్రజలకు చేరువయ్యేలా చూడడంతో పాటు మహిళా సంఘాలకు రుణాలు అందిస్తూ వారికి ఆర్థిక తోడ్పాటు అందేలా చూస్తున్నాం. అయినా తమకు కేవలం రూ.4 వేల జీతం మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తోంది. ఆ జీతాలను సైతం గత 8 నెలలుగా ప్రభుత్వం నుంచి విడుదల కావడం లేదు. ప్రభుత్వం తమ జీతాలను త్వరగా అందించాలి.

క్యాన్సర్ పట్ల మహిళలు అవగాహన కలిగి ఉండాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్

భిక్కనూరు, ఫిబ్రవరి 2: క్యాన్సర్ వ్యాధి పట్ల మహిళలు అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వాస్థవ క్యాన్సర్ కేర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో క్యాన్సర్ పరీక్షలు, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్య శిబిరంలో భాగంగా 130 మందికి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించి ఇందులో అనుమానం ఉన్న ఐదుగురి వద్ద శాంపిళ్లను సేకరించి టెస్ట్‌ల నిమిత్తం పంపించామన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది తప్పకుండా సమయపాలన పాటించాలని సూచించారు. అంతకుముందు మహిళలకు క్యాన్సర్ వ్యాధి రావడానికి గల కారణాలు, చికిత్సలు, రకాలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు హెమిమా, ఆదర్శ్, ఫార్మాసిస్టు వెంకటరమణ, ఆసుపత్రి సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.


భిక్కనూరులో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

'లబ్ధిదారులకు దళితబంధు నిధులు ఇవ్వాలి'

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి2: జిల్లాలో రెండోవిడుత లబ్ధిదారులకు దళిత బంధు నిధులు విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం కామారెడ్డి జిల్లా దళితబంధు లబ్ధిదారులు సెక్రటరియట్ సిబ్బందికి వినతిపత్రం అందించినట్లు తెలిపారు. లబ్ధిదారులు ఎంచుకున్న యూనిట్స్‌పై అధికారులు విచారణచేశార ని ఖాతాలలో కొంతమేరకు నిధులను కూడా జమచేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటివరకు పూర్తిస్థాయిలో దళితబంధు నిధును లబ్ధిదారులకు ఇవ్వడంలో జాప్యం జరుగుతుందని వెంటనే నిధులను విడుదల చేసి మా దళిత కుటుంబాలను ఆదుకోవాలని కోరమన్నారు.

సర్పంచ్‌లకు సన్మానం

లింగంపేట, ఫిబ్రవరి2: మండలంలోని 41మంది సర్పంచ్‌లను శుక్రవారం ఘనంగా సన్మానించారు. గత ఐదేళ్లుగా గ్రామాల్లో మంచి సేవలు అందించి, గ్రామాభివృద్ధికి సహకరించిన సర్పంచ్‌లను అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించి వారిసేవలను కొనియాడారు.

'బీజేపీ అధ్యక్షులను పట్టించుకోకుంటే ప్రతిఘటిస్తాం'



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

తాడ్వాయి, ఫిబ్రవరి 2: మండలాల బీజేపీ అధ్యక్షులను, కార్యదర్శులను పట్టించుకోకుంటే ప్రతిఘటిస్తామని ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని బీజేపీ మండల అధ్యక్షులు, కార్యదర్శులు హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తున్నా తమకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో టికెట్లు తీసుకుని వచ్చి బీజేపీ అధ్యక్షులను, కార్యదర్శులను, కార్యకర్తలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇటీవల ఎల్లారెడ్డి అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన వడ్డెపల్లిసుభాష్‌రెడ్డి బీజేపీ టికెట్ తెచ్చుకుని అధ్యక్షులను, కార్యదర్శులను పట్టించుకోవడం లేదని అన్నారు. గతంలో ఉన్న కాంగ్రెస్ పార్టీనాయకులు,కార్యకర్తలకే వత్తాసు పలుకుతున్నాడని తెలిపారు.రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో సైతం పోటి చేయబోయే అభ్యర్థులు తమను పట్టించుకోకుంటే గట్టి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి లేకుండా కొందరు నాయకులు జహీరాబాద్ పార్లమెంటుకు పోటీ చేస్తామని సంకేతాలు తెలుపుతూ గ్రామాలలో ఫ్లెక్సీలు కడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా పార్లమెంట్ నియోజకవర్గంలో పోటీ చేసే అభ్యర్థులు తమను పట్టించుకోకుంటే కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల బీజేపీ అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్యామ్‌సుందర్‌రెడ్డి

'ప్రశ్నించే ముందు అభివృద్ధిపై ఎంపీపీ ఆత్మ విమర్శ చేసుకోవాలి'

మాచారెడ్డి, ఫిబ్రవరి 2: తమను ప్రశ్నించేముందు ఎంపీపీ లోయపల్లి నర్సింగ్‌రావు గత 25 ఏళ్లలో ఏం అభివృద్ధి చేశాడో ఆత్మవిమర్శ చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీరాంజనేయ వేంకటేశ్వరస్వామి ఆలయం స్థలం మాచారెడ్డి గ్రామస్థుడు ఇవ్వగా గత ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి అభివృద్ధికి కృషిచేశారని మాచారెడ్డి గ్రామ పెద్దమనుషుల శ్రమతో ఆలయ నిర్మాణం జరిగిందని అన్నారు. ప్రజాప్రతినిధి అయిన మీరు దేవాలయం యొక్క ఆస్తిని మీ పేరున ఇతరుల పేరున ఏ విధంగా నమోదు చేసుకున్నారో సమాధానం ఇవ్వాలని అన్నారు. కరెంటు మీటర్లు కూడా మీ పేర్లపైన ఎలా తీసుకున్నారని ప్రశ్నించారు కార్యక్రమంలో గ్రామస్తులు భాస్కర్‌గౌడ్, పిట్ల శ్రీనివాస్, రమేష్‌నర్సాగౌడ్, లింగం, రాజు, ఆశ్రఫ్, అర్షద్, సతీష్, బద్రి పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్

గాంధారి, ఫిబ్రవరి2: గాంధారి గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా తహసీల్దార్ జానకి గ్రామ సచివాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధుల పట్ల అప్రమత్తంగా ఉండి పనులు సజావుగా ఉండేందుకు సిబ్బంది సహకరించాలని సూచించారు. ఏ సమస్య ఉన్నా తక్షణమే స్పందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవ్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

ఎస్సైగా ఆంజనేయులు బాధ్యతల స్వీకరణ

గాంధారి, ఫిబ్రవరి 2: మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో నూతన ఎస్సైగా ఆంజనేయులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తాడ్వాయి మండలం నుంచి బదిలీపై గాంధారి పోలీసుస్టేషన్‌కు వచ్చారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలను కాపాడుతానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

లావాదేవీలను సక్రమంగా నిర్వహించాలి

సదాశివనగర్, ఫిబ్రవరి2: మహిళా సమాఖ్య గ్రామ సంఘాలలోని ఆర్థిక లావాదేవిలను సీఏలు సక్రమంగా నిర్వహించాలని ఏపీఎం రాజారెడ్డి తెలిపారు. సదాశివనగర్‌ఐకేపీలో సీఏల రివ్యూ సమావేశం నిర్వహించారు. ప్రతీ సంఘం యొక్క పొదుపులు అప్పులు ప్రతీ సభ్యుడి వివరాలను రిజిస్టర్‌లో పొందుపరిచి ఆర్థిక లావాదేవిలతో ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. సంఘాల నిర్వహణ ప్రతినెల సమావేశం, పొందిన ఆర్థిక లావాదేవిలతో వ్యాపారాల పరివర్తన లాభనష్టాల వివరాలను సంఘాలలో చర్చించాలన్నారు. కార్యక్రమంలో సీసీలు అబ్బులింగం, గొర్రైరాములు, నరేందర్‌రెడ్డి, కృష్ణ, అంజలి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన జడ్పీటీసీ


లింగంపేట, ఫిబ్రవరి2: మండలంలోని ఒంటర్‌పల్లిలో శుక్రవారం జడ్పీటీసీ శ్రీలతసంతోష్‌రెడ్డి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. గ్రామం లోని ప్రధాన రహదారి పూర్తిగా చెడిపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో గ్రామంలోని రోడ్డును సీసీరోడ్డు వేయాలని జెడ్పీటీసీని ఆదేశించడంతో జెడ్పీ నిధులతో సీసీరోడ్డు వేస్తున్నట్లు ఆమె తెలిపారు. పనులను నాణ్యతగా చేపట్టాలని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో పీఏసీస్ చైర్మన్ దేవెందర్‌రెడ్డి, సర్పంచ్‌లు రాజశేఖర్‌రెడ్డి, రాంరెడ్డి, సతీష్‌గౌడ్, ఎంపీటీసీ దత్తాద్రీలతో పాటు నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

మొక్కలను రక్షించే బాధ్యత ప్రతీఒక్కరిది


దోమకొండ, ఫిబ్రవరి2: ప్రతీఒక్కరు మొక్కలను రక్షించాలని ఎంపీడీవో, దోమకొండ గ్రామ ప్రత్యేకాధికారి చిన్నారెడ్డి అన్నారు. శుక్రవారం వాటరింగ్‌డే సందర్భంగా దోమకొండ జీపీలో మొక్కలకు నీరు పట్టారు. అనంతరం గ్రామపంచాయతీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామంలో చెత్తసేకరణ, వాటర్ సప్లయ్, తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎవరైన చెత్త బయట వేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కార్యదర్శి సౌజన్యకు ఆదేశించారు. సిబ్బంది ఇన్సూరెన్సును చేసుకోవాలని సూచించారు.గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో తిరుపతిరెడ్డి, బిల్ కలెక్టర్ కిషన్, ఆపరేటర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులపై హర్షం

మద్నూర్, ఫిబ్రవరి2: మండలకేంద్రంలో పాతబస్టాండ్ వద్ద అధ్వానంగా తయారైన రోడ్డుకు మరమ్మతులు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వానికి ఎన్నిమార్లు విన్నవించినా పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకిరావడంతో పనులు చేపడుతున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.
















బోధన్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో పర్భన్న


గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన

బోధన్ రూరల్, ఫిబ్రవరి 2: బోధన్, సాలూర మండలాల్లోని అన్ని గ్రామాల్లో శుక్రవారం నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుందని బోధన్ ఎంపీడీవో పర్భన్న అన్నారు. గ్రామ పంచాయితీ సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో శుక్రవారం నుంచి అన్ని గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగింది. ఈ సందర్భంగా అన్ని గ్రామాలకు సర్పంచ్‌ల స్థానంలో ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఎంపీడీవో పర్భన్న తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రత్యేకంగా నియమించిన అధికారులకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గ్రామాల్లో సర్పంచ్‌ల స్థానంలో ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందన్నారు. ఎంపీడీవో పర్భన్నతో పాటు తహసీల్దార్‌లు గంగాధర్, మల్లయ్యలతో పాటు అన్ని గ్రామాల్లో ప్రత్యేక అధికారులు సర్పంచుల స్థానంలో ప్రత్యేక అధికారుల బాధ్యతలను స్వీకరించారు.

స్వర్ణకార సంఘ అధ్యక్షుడిగా జనార్ధన్‌చారి

బోధన్ రూరల్, ఫిబ్రవరి 2: బోధన్ స్వర్ణకార సంఘం అధ్యక్షులుగా శ్రీదోజ్ వార్ జనార్ధన్ చారి శుక్రవారం ఎన్నికయ్యారు. బోధన్ పట్టణంలోని విశ్వకర్మ భవనంలో శుక్రవారం స్వర్ణకార సంఘం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షులుగా జనార్ధన్ చారి, ప్రధాన కార్యదర్శిగా త్రివేణి నాగరాజు చారి, కోశాధికారిగా ఎం. నారాయణచారి, ఉపాధ్యక్షులుగా బి.హనుమాన్‌చారిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షులు తంగేళ్ళపల్లి శ్రీనివాసచారి తెలిపారు. ఎన్నికల కమిటీ సభ్యులుగా మురహరి చారి, సుధాకర్‌చారి, సుంకోజు హరికాంత్‌చారి, కె.బాలాజీ చారి, అశోక్ చారిలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘం నాయకులు కాళిదాస్‌చారి, ప్రభాకర్‌చారి, రమణాచారి, భాస్కర చారి, రమేష్‌చారి, రాజశేఖర్ చారి, తదితరులు ఉన్నారు.





డిస్ట్రిబ్యూటరీ కాలువపై పిచ్చిమొక్కలు

● డి19 కాలువలో చెత్తాచెదారం ● దిగువన రైతుల పంటల సాగుకు అందని నీరు ● పట్టించుకోని అధికారులు

ఏర్గట్ల, ఫిబ్రవరి 2: మండల కేంద్రంలోని కాకతీయ డిస్ట్రిబ్యూటరి 19 కాలువ చెత్తాచెదారం నిండిపోయింది. కాక కాలువలో చెత్తాచెదారంతో పాటు ఇరువైపుల పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. అంతేకాకుండా కాలువలో విరిగిపోయిన చెట్ల కొమ్మలు పడటంతో వాటికి నాచు తయ్యారయ్యి సాగునీటి ప్రవహానికి అడ్డంగా ఏర్పడింది. అలాగే చెత్తాచెదారంతో నీరు కలుషితమవు తోంది. ఈ డిస్ట్రిబ్యూటరీ కాలువ ద్వార ఏర్గట్ల, తాళ్లరాంపూర్, గుమ్మిర్యాల్, దోంచంద గ్రామాలకు సుమారు 2,500 ఎకరాలకు సాగు నీరు అందుతోంది. అయితే కాలువకి అక్కడక్కడ గైడ్ వాల్స్ కూలిపోవడంతో నీరు వృథాగా పోతోంది. అంతేకాకుండా కాలువలో చెత్తాచెదారం నిండి సాగుకు నీరు పూర్తిస్థాయిలో అందటం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు కాలువను పరిశీలించి పూర్తిస్థాయిలో పంటలకు సాగునీరు అందేలా చూడాలని స్థానిక రైతులు కోరుతున్నారు.


డి19 కాలువ కనిపించకుండా పెరిగిన పిచ్చిమొక్కలు


చెత్తాచెదారంతో నిండిపోయిన కాలువ

ఘనంగా జాతీయ ఉపాధి హామీ దినోత్సవం

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 2: జాతీయ గ్రామీణ ఉపాధి హామి దినోత్సవ వేడుకలు మండలవ్యాప్తంగా ఉపాధిహామి కూలీలు, అధికారులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పనులు జరుగుతున్న చోట కేక్‌కట్‌చేసి పంపిణీచేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం ప్రారంభమై నేటితో 18 సంవత్సరాలు పూర్తయి 19వ ఏట అడుగిడిన సందర్భంగా ఈ సంబురాలు జరుపుకున్నారు. కమ్మర్‌పల్లి గ్రామశివారులో మండల ఎంపీపీ లోలపు గౌతమి కేక్‌కట్ చేసి సబరాల్లో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు షఫి, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, మేట్‌లు ఉపాది కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

● ఉపాధి హామీ కూలీలకు సన్మానం

ఏర్గట్ల: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం గ్రామాల్లో వంద రోజుల పనులు పూర్తి చేసిన ఉపాధి కూలీలను ఈజీఎస్ సిబ్బందిని సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందున కూలీలను సన్మానించారు. ఇందులో ఎంపీవో శివచరణ్, ఈజీఎస్ వెంకట్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు దొబ్బల రాజన్న, బడిగిరి అనిల్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.


కమ్మర్‌పల్లిలో పనుల చోట కేక్‌కట్ చేస్తున్న ఎంపీపీ లోలపు గౌతమి


ఏర్గట్లలో ఉపాధిహామీ కూలీలను సన్మానిస్తున్న ఈజీఎస్ సిబ్బంది

పంచాయతీ పాలకవర్గాలకు ఘనంగా వీడ్కోలు

నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి 2: రూరల్ మండలం గుండారం గ్రామ పాలకవర్గానికి ఘన సన్మానం నిర్వహించారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ లక్ష్మణ్‌రావు, ఉపసర్పంచ్ శంకర్‌రెడ్డిలతోపాటు వార్డు సభ్యులను వీడీసీ పెద్దలు శాలువాతో సన్మానించారు. ఐదేళ్ల పదవీకాలంలో గ్రామాన్ని అభివృద్దిపథంలో నిలిపామని సర్పంచ్ తెలిపారు. పార్టీలకు అతీతంగా ఉపసర్పంచ్ బీజేపీకి చెందిన వ్యక్తి అయినా తనకు సహకరించారని ఉపసర్పంచ్ శంకర్‌రెడ్డిని అభినందించారు. అనంతరం వార్డు సభ్యులతోపాటు ఎంపీటీసీ, జడ్పీటీసీలను కూడా సన్మానించారు. గుండారం గ్రామ ప్రత్యేక అధికారిగా రూరల్ తహశీల్దార్ అనిరుద్ బాధ్యతలు చేపట్టారు. ఇందులో సర్పంచ్ వారం లక్ష్మణ్‌రావు, ఉపసర్పంచ్ శంకర్‌రెడ్డి, కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, వీడీసీ పెద్దలు పోతన, దాసరి ఒడ్డెన్న, దాసరి శ్రీధర్, లింగారెడ్డి, అబ్దుల్, అఫ్జల్, తదితరులు పాల్గొన్నారు.

మోస్రా: మండల కేంద్రంతో పాటు మండలంలోని చింతకుంట, గోవూర్, చే నెంబర్ తండా, తిమ్మాపూర్ గ్రామాలలో గ్రామ పంచాయతీ పాలకవర్గం 5సంవత్సరాల పదవీకాలం పూర్తి కావడంతో కార్యదర్శి ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో సర్పంచ్, పాలకవర్గంను పూలమాలలు, శాలువతో సన్మానించారు. గ్రామ అభివృద్ధికి సహకరించిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి సాయిలు, సర్పంచ్ సుమలత రాంరెడ్డి, ఉప సర్పంచ్ సుదర్శన్ గౌడ్, కార్యదర్శి ప్రేమ్ కుమార్, పంచాయతీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: ఐదేళ్ల పదవికాలం ముగియడంతో పదవీ విరమణ పొందిన మండల సర్పంచ్‌లను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లోలం గౌతమి, మండల ఎంపీటీసీలు అధికారులు ఘనంగా సన్మానించారు. అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, వివిధ శాఖల అధికారుల సహకారంతో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కలేరి శేఖర్, మండల ఎంపీటీసీలు, ఎంపీడీవో సంతోష్ రెడ్డి, ఎంఈవో ఎస్.ఆంధ్రయ్య, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


గుండారంలో పంచాయతీ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం


కమ్మర్‌పల్లిలో సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎంపీపీ, అధికారులు

'టీయూలో సీట్లను భర్తీ చేయాలి'

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 2: తెలంగాణ యూనివర్సిటీ పీజీ, ఎల్ఎల్‌బీ కోర్సుల్లో మిగిలిన సీట్లను గ్రామీణ ప్రాంతాల్లో ఉండే విద్యార్థులకు ఉపయోగపడేలా ఉన్నత చదువులు అభ్యసించేందుకు కౌన్సిలింగ్ ద్వార మిగిలిన సీట్లను భర్తీ చేయాలని టీయూ రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరికి శుక్రవారం ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘాల నాయకులు వినతి పత్రం అందజేశారు. విద్యార్థులకు మిగిలిపోయిన సీట్లను భర్తీ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు లక్ష్మణ్, రామ్‌జీ, కార్తిక్, వినోద్, సుధాకర్,లు కోరారు.

ఆదర్శ పాఠశాలలో వీడ్కోలు సమావేశం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 2: మండలంలోని బీబీపూర్ తండా శివారులో గల ఆదర్శ పాఠశాల, కళాశాలలో శుక్రవారం విద్యార్థుల వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గణేశ్ మాట్లాడుతూ.. జిల్లాలోనే పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు తీసుకొచ్చి మోడల్ పాఠశాల డిచ్‌పల్లి పేరు ను ముందువరుసలో ఉంచాలని ఆయన కోరారు. విద్యార్థినీ, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

కోటగిరి, ఫిబ్రవరి 2: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో శుక్రవారం వ్యక్తిగత పరిశుభ్రతపై మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ అవగాహన కల్పించారు. చేతులు నిరంతరం పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. చిన్న ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి స్థానికంగా చికిత్సలు అందజేశారు. అనంతరం కుష్ఠు వ్యాధి లక్షణాలు నివారణకు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సవితరాణి, సూపర్‌వైజర్ జ్యోతి, సంగీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి'

బోధన్ రూరల్, ఫిబ్రవరి 2: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పార్టీయే గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడ్లూరి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలో బీజేపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెకు పోదాం అభియాన్ వర్క్ షాప్‌లో పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. బీజేపీని మరింత బలోపేతం చేయాలని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి మోహన్‌రెడ్డి, కన్వీనర్ స్వామి యాదవ్, మండల అధ్యక్షుడు మనోహర్, ప్రవీణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు లచ్చప్ప, పోశెట్టి, బూత్ అధ్యక్షుడు, శక్తి కేంద్రం ఇంచార్జిలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 2: ఈనెల 3, 4, 5వ తేదీల్లో కరీంనగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి వెట్ లిఫ్టింగ్ పోటీలకు మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు మనోజ్, సిద్ధు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు సీతయ్య తెలిపారు. రాష్ట్ర స్థాయిలో మంచి ప్రతిభ కనబర్చాలని ఆయన ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

చేపూర్‌లో నర్సరీ పరిశీలన

ఆర్మూర్ రూరల్, ఫిబ్రవరి 2: ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలో ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన లక్కం ప్రభాకర్ శుక్రవారం నర్సరీని పరిశీలించారు. నర్సరీలో పెంచుతున్న మొక్కల గురించి అడిగి తెలుసుకున్నారు. వివిధ రకాల పువ్వుల మొక్కలను పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. అదే విధంగా పల్లె ప్రకృతి నాన్ని సందర్శించి అత్యవసరంగా పరిష్కారించాల్సిన పనులను గుర్తించారు. మొక్కలను సంరక్షించానికి పైపులు కొనుగోలు చేయాలని కార్యదర్శులు సూచించారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మరుగుదొడ్ల వినియోగానికి నీటి సదుపాయ కల్పించాలని సూచించారు.

కొనసాగుతున్న నాయకుల నిరసన

ఆర్మూర్ టౌన్, ఫిబ్రవరి2: పట్టణంలోని ముస్లిం మైనారిటీ నాయకులు మున్సిపల్ ఇన్‌చార్జీ చైర్మన్‌ను నియామించాలని శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం కొనసాగుతుంది. మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై అవిశ్వాస తీర్మానం నెగ్గి ఇప్పటి వరకు ఇన్‌చార్జి చైర్మన్‌ను నియమించకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోందని ఎన్నికల అధికారి అవిశ్వాసం నెగ్గిన తీర్మాన కాపీని కలెక్టర్‌కు పంపగా ఆ రిపోర్టును రాష్ట్ర ప్రభుత్వానికి పంపారని నూతన చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియ ప్రారంభించకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని వారన్నారు. మైనారిటీకి చెందిన మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్‌మున్నను ఇన్‌చార్జీ చైర్మన్‌గా నియామించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

బేకరిలో అధికారుల తనిఖీ

ఆర్మూర్ టౌన్ ఫిబ్రవరి 2: ఆర్మూర్ పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో గల డాల్ఫిన్ బేకరీలో శుక్రవారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ అశోక్‌సింగ్, సివిల్ సప్లయ్, అధికారులు వినోద్‌కుమార్, శ్రీనివాస్, అగ్నిమాపక అధికారి మధుసూదన్ రెడ్డిలు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడరాదని, బేకరీలో ఆహార పదార్థాల తయరీ అధ్వనంగా ఉండడం పట్ల దుకాణంలో పని చేస్తున్న వారిపై ఆయన ఈ సందర్భంగా ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.


టీయూలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆడిట్‌సెల్ డైరెక్టర్ ఘంట

బీఈడీ పరీక్షా కేంద్రం పరిశీలన

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 2: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ 1, 2, 3వ సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో పరీక్షలు ప్రారంభమయ్యాయని ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. దీనిలో భాగంగా పరీక్షలకు 39మంది అభ్యర్థులకు గాను మొత్తం మంది పూర్తి స్థాయిలో హాజరయ్యారని, పరీక్ష కేంద్రంలో సౌకర్యాలపై పరీక్ష కేంద్రాన్ని సందర్శించినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్ ఈ సందర్భంగా తెలిపారు.

ఆపరేషన్ స్మైల్‌లో 65పిల్లల గుర్తింపు

● సీపీ కల్మేశ్వర్ శింగనేవార్

ఖిల్లా, ఫిబ్రవరి 2: పోలీసు శాఖలో అమలవుతున్న ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని జనవరి 1వ తేదీ నుంచి జనవరి 31వ తేదీ వరకు నిర్వహించగా కమిషనరేట్ పరిధిలో మొత్తం 65 మంది బాలలను గుర్తించినట్లు పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ శింగనేవార్ తెలిపారు. ఈ ఆపరేషన్ ముఖ్య ఉద్దేశం 18ఏళ్ల లోపు తప్పిపోయిన, వదిలివేసిన కార్మికులుగా ఉన్న బాలబాలికలు ఉన్నట్లుయితే అలాంటి వారి సమాచారం సేకరించి వారితో పని చేయించిన యాజమానిపై కేసు నమోదు చేయడం కాని లేదా వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేసి అప్పగించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు లేని వారిని చైల్డ్‌వెల్ఫేర్ కమిటి (సీడబ్ల్యుసి) వారికి అప్పగించడం జరుగుతుందన్నారు. ఈ ఆపరేషన్ స్మైల్ ఎక్స్‌లో భాగంగా కమిషనరేట్ పరిధిలో గతనెల 65మంది పిల్లలను పట్టుకోవడం జరిగిందన్నారు. పిల్లలను పట్టుకుని వారిని పనిలో పెట్టుకున్న యజమానులపై వివిధ పోలీసు స్టేషన్లలో కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. అలాగే తప్పిపోయిన పిల్లల వివరాలను దర్పన్‌యాప్‌లో నమోదు చేసి వారి అడ్రస్‌లను గుర్తించడానికి ప్రయత్నించడం జరుగుతుందన్నారు.

స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువు పెంపు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 2: 2023-24 విద్యా సంవత్సరంలో వివిధ కళాశాలల్లో చదువుతున్న అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకునే గడువును మార్చి 31వ తేది వరకు పొడగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి శశికళ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్రెష్, రెన్యూవల్ విద్యార్థులు తెలంగాణ ఈ-పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు ఈ సందర్భంగా కోరారు.

కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఉద్యమిద్దాం : ఐఎఫ్‌టీయూ

బోధన్ రూరల్, ఫిబ్రవరి 2: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఉద్యమించాలని ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని తట్టికోటలో బీడీ కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీడీ కార్మి కులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్రం యాజమాన్యాలకు అనుకూలంగా చట్టాలను మార్చిందన్నారు. బీడీ కార్మికులు కష్టపడి పీఎఫ్ ఖాతాల్లో జమ చేసుకున్న డబ్బులను షేర్ మార్కెట్‌లకు మార్చి కార్మికులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పెద్ద ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు సంఘం జిల్లా నాయకులు పడాల శంకర్, బీడీ కార్మిక సంఘం నాయకురాలు రమ, లక్ష్మీ, గంగామణి, సావిత్రి, గోదావరి, విజయ, జమున, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.


దుకాణ సముదాయాలను తాళాలు వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలి : కమిషనర్

బోధన్ రూరల్, ఫిబ్రవరి 2: బోధన్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వ్యాపారస్తులు మున్సిపాలిటీ ఆస్తి పన్ను బకాయిలు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని బోధన్ మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ అన్నారు. శుక్రవారం ఆస్తి పన్నులు చెల్లించని 11 దుకాణా సముదాయాల షెటర్లకు తాళాలు లేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి పన్ను బకాయిదారులు తప్పకుండా మీ సేవా కేంద్రాల్లో, మున్సిపల్ సిబ్బందికి బకాయిలు చెల్లించి రసీదులు తీసుకోవాలన్నారు. లేనియెడల ఆస్తులు జప్తు చేయడం జరుగుతుందన్నారు. ఆయన వెంట బిల్ కలెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

నగరంలో బాలుడి కిడ్నాప్

● పోలీసుల అదుపులో దుండగుడు.. విచారణ

ఖిల్లా, ఫిబ్రవరి 2: నగరంలోని మాలపల్లి ప్రాంతానికి చెందిన మినాహజ్ అనే ఏడేళ్ల బాలుడిని అదే కాలనీకి చెందిన కొందరు వ్యక్తులు అపహరించి అమ్మివేసినట్లు తెలిసింది. ఈ ఘటన జనవరి 30న చోటు చేసుకోగ బాధితులు అదేరోజు ఒకటో టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలుడి తండ్రి మహ్మద్ అయాజ్ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు ఆప్రాంతంలోని అన్ని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. బాలుడి కుటుం సభ్యులు ఉంటున్న భవనంలోనే సోహెల్ ఉంటున్నట్లు తెలిసింది. బాలుడిని కిడ్నాప్ చేసింది అదే కాలనీలో నివాసం ఉంటూ హోటల్ నడుపుతున్న సోహెల్ అనే వ్యక్తిని గుర్తించి అనుమానం తో ఆయన సెల్ నెంబర్ లొకేషన్‌ను, గుర్తించారు. సెల్ లొకేషన్ విజయవాడలో ఉన్నట్లు చూపించగా పోలీసులు అక్కడికి వెళ్లారు. అక్కడి నుంచి లొకేషన్ హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసులు హైదరాబాద్‌లోని ఓ లాడ్జ్‌లో తనికీ చేయగా సోహెల్ అక్కడ లభించాడు. సోహెల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. సోహెల్ మాత్రం పోలీసులకు పొంతన లేకుండా సమాధానాలు ఇస్తున్నట్లు సమాచారం. కిడ్నాపర్‌ను పోలీసులు పట్టుకొచ్చినట్లు తెలుసుకున్న బాలుడి కుటుంబసభ్యులు పోలీసు స్టేషన్‌కు చేరుకుని సోహెల్‌ను అప్పగిచాలని ఆందోళనకు దిగారు. పోలీసులు విచారణ చేసి వాస్తవాలను తెలుసుకునే పనిలో ఉండడంతో బాలుడి కుటుంబ సభ్యులను నచ్చచెప్పి బయటకు పంపారు. సోహెల్ గతంలో పిల్లలను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్మినట్లు తెలిసింది. సోహెల్ స్వయంగా తనకు తెలిసిన వారి పిల్లలను అమ్మడం వల్ల ఈ విషయం బయటకు పొక్కలేదని స్థానికులు తెలిపారు.


కిడ్నాప్‌కు గురైన బాలుడు



బీర్కూర్ పీహెచ్‌సీ పరిసరాలను పరిశీలిస్తున్న శిరీష

వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో శిరీష

బీర్కూర్, ఫిబ్రవరి 2 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో శిరీషా పరిశీలించారు. ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన రికార్డులను, మందులను, గదులను పరిసరాలను తనిఖీ చేశారు. అనంతరం పీహెచ్‌సీలో వసతులు, అవసరాల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రవీందర్, సిబ్బంది, ప్రభు తదితరులు ఉన్నారు.

బాలికను కస్తూర్బాలో చేర్పించిన అధికారులు

నిజాంసాగర్, ఫిబ్రవరి 2: మహ్మద్‌నగర్ మండలంలోని తెల్గాపూర్ గ్రామానికి చెందిన సౌజన్య అనే బాలిక బడికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉండటంతో సీఆర్పీ వెంకట్రామాగౌడ్ బడి బయట పిల్లల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా బాలికను గుర్తించారు. తల్లిదండ్రులతో మాట్లాడి కొత్తబాది కస్తూర్బా పాఠశాలలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా ప్రిన్సిపాల్ విజయ లత, తదితరులున్నారు.

యువకుడి అదృశ్యం



చింతల సురేష్

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 2: కామారెడ్డి గోసంగి కాలనీలో నివాసం ఉంటున్న చింతల సురేష్ కనిపించకుండా పోయినట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గత నెల 31న సాయంత్రం 4 గంటలకు ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగి ఇంటికి రాలేదని కుటుంబీకులు చుట్టుపక్కల వెతికినా, బంధువుల ఇంట్లో విచారించినా అతని ఆచూకీ లభించలేదని తెలిపారు. దీంతో శుక్రవారం కామారెడ్డి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న అప్పల ప్రసాద్

మాధవ సేవలో ప్రతి ఒక్కరూ పాలు పంచుకోవాలి

● సామాజిక సామరస్యత రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్

రామారెడ్డి, ఫిబ్రవరి 2: మాధవ సేవలో ప్రతి ఒక్కరూ పాలు పంచుకోవాలని సామాజిక సామరస్యత రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో వివేకానంద విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని యువకులు పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణ, విభాగ కార్యదర్శి తుమ్మల కృష్ణ, గంగాధర్, భూపతి, శ్రీనివాస్, శ్రీకాంత్, రంజిత్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.



పల్లె ప్రకృతి వనంలో నరికివేయబడిన చెట్లు

పల్లె ప్రకృతి వనంలో చెట్ల నరికివేత

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 2: మండలంలోని కాస్లాబాద్ గ్రామంలో శుక్రవారం గుర్తు తెలియని దుండగులు పల్లె ప్రకృతి వనంలో ఉన్న చెట్లను నరికి వేశారు. గురువారం వరకు బాగానే ఉన్న ప్రకృతి వనంలోని చెట్లను శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేశారు. గత ప్రభుత్వం గ్రామాల్లో పచ్చదనం పెంపొందించడానికి లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. ఈ ప్రకృతి వనంలో పండ్ల చెట్లతో పాటు వివిధ రకాల మొక్కలను పెంచారు. వీటి నిర్వహణ బాధ్యతను పంచాయతీలకు అప్పగించారు. అయితే శుక్రవారం ఏం జరిగిందో తెలియదు గాని ప్రకృతి వనంలోని చెట్లన్నీ నేలకొరిగాయి. ఈ విషయం గ్రామ జూనియర్ పంచాయతీ కార్యదర్శి వివరణ కోరగా తనకు ఈ విషయం ఇప్పుడే తెలిసిందని, శనివారం పంచాయతీకి వెళ్లిన తర్వాత పల్లె ప్రకృతి వనంను సందర్శించి చెట్ల నరికివేతకు గురైన విషయం గురించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి, వారి ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తాం

● మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి

బీర్కూర్, ఫిబ్రవరి 2: కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో పునర్నిర్మించి, పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తామని కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ గ్రామస్థాయి పునర్నిర్మాణం కార్యక్రమంలో భాగంగా ఆయన బీర్కూర్ మండలంలోని రైతునగర్, అన్నారం, చించోలి, కిష్టాపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఆయన సమక్షంలో గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయి నుంచి పైస్థాయి వరకు కాంగ్రెస్‌ను బలోపేతం చేయడానికి గ్రామస్థాయి పునర్ని ర్మాణం కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. బాన్సువాడ నియోజక వర్గంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తు న్నామన్నారు. కమిటీల ఏర్పాటు అనంతరం ఎలా వ్యవహరించాలి, పార్టీని ఎలా బలోపేతం చేయాలి తదితర అంశలపై ఆయన సూచనలు చేశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీలను భారీ మెజారిటీ తో గెలిపించేందుకు ప్రతీ కార్యకర్త నడుం బిగించాలని పిలుపునిచ్చారు. కాగా బాన్సువాడ నుంచి బీర్కూర్‌కు తన వాహనంలో వస్తుండగా రైతునగర్ గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై ఒక వ్యక్తి కుక్కను ఢీకొని పడ్డాడు. ఈ ఘటనలో ఆ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కారులో వెళుతున్న రవీందర్‌రెడ్డి కారును నిలిపి ఆ వ్యక్తిని తన వాహనంలో ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించాడు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

బాన్సువాడ టౌన్: ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించేలా చూడాలని బాన్సువాడ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డికి శుక్రవారం ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఆర్టీసీలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి పింఛన్ రాదని, వారికి ఆసరా పింఛన్ అందేలా చూడాలని, ఇళ్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, రేషన్‌కార్డులు ఇవ్వాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఒకే సారి చెల్లించాలని వారు కోరారు. ఈ మేరకు మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం అయ్యేవిధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో దోసెపల్లి శంకర్, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు తదితరులున్నారు.



రైతునగర్‌లో కాంగ్రెస్‌లో చేరిన వారికి పార్టీ కండువా కప్పుతున్న రవీందర్‌రెడ్డి

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

దోమకొండ, ఫిబ్రవరి 2: దోమకొండ, బీబీపేట మండలాలకు చెందిన కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అందజేశారు. దోమకొండ మండలంలో మొత్తం 12 రాగా అందులో చింతమాన్‌పల్లి 3, ముత్యంపేట 3, అంచనూర్ 3, లింగుపల్లి 1, గొట్టిముక్కుల 1, సంగమేశ్వర్ 1 చొప్పున పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, నాగరాజు, ఎంపీడీవో చిన్నారెడ్డి, తహసీల్దార్ సంజీవ్‌రావ్, నాయబ్ తహసీల్దార్ రేఖ, గిర్ధావార్ మహేందర్‌రెడ్డి, షమ్మీ, సార్ల నర్సింలు, లక్ష్మారెడ్డి, నరేందర్‌రెడ్డి, చింతల రాజేష్, విఠల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి,ఎస్‌పాల్, డి.రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



దోమకొండలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే



ఉపాధి హామీ పథకం ఉద్యోగులతో కలెక్టర్

ఉపాధి హామీ పథకం ఉద్యోగులకు వేతన స్కేల్ వర్తింపుపై హర్షం

కామారెడ్డి రూరల్, ఫిబ్రవరి 2: ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న ఉద్యోగులకు వేతన స్కేల్ వర్తింప చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మాత్యులు అనసూయ ప్రకటించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఉపాధి హామీ సిబ్బంది ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధి హామీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పంచాయతీరాజ్ శాఖ మాత్యులు పేస్కేల్ వర్తింపచేస్తున్నట్లు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాయన్న నేతృత్వంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్‌ను కలిసి పేస్కేల్ వర్తింప జేసినందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి హామీ కూలీలకు స్వీట్ల పంపిణీ

మద్నూర్, ఫిబ్రవరి 2: గ్రామీణ ప్రాంతాలలో పేద కూలీలకు ఉపాధి కల్పించడానికి గాను కేంద్రంలో 19సంవత్సరాల క్రితం ప్రారంభించిన జాతీయ ఉపాధి హామీ పథకం 19వ ఆవిర్భావం ఉండటంతో ప్రత్యేకాధికారి విజయ్ స్వీట్లు పంపిణీ చేశారు. ఉమ్మడి మండలాల నుంచి కూలీ కోసం వేసవిలో ఇతర ప్రాంతాలకు వెళ్లేవారని, కేంద్ర ప్రభుత్వంతో గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి కల్పిస్తున్నారన్నారు. రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జాబ్‌కార్డులున్న వారికి ఉపాధి పనులు కల్పిస్తామని, ఈ అవకాశాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపీవో పద్మ, గ్రామ పంచాయతీ కార్యదర్శి సందీప్, తదితరులున్నారు.

పదో తరగతి విద్యార్థులు పరీక్షల భయాన్ని వీడాలి

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 2: పదో తరగతి విద్యార్థులు పరీక్షల భయాన్ని వీడాలని ఎంఈవో వెంకటేశం అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి మండలంలోని అడవి లింగాల జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు సంబంధించి అంశాలను సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు మంచిగా రాసి మంచి పౌరులుగా ఎదగాలని దేశ ప్రధాని నరేంద్రమోది సూచించిన ఎగ్జామ్ వారియర్స్‌లోని 25 అంశాలకు సంబంధించిన గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించి భావిభారత నిర్మాణంలో భాగస్వాములు అయ్యే విధంగా తమ నడవడికను మార్చుకుని మంచి విద్యాబుద్ధులతో ఉన్నతమైన స్థానానికి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నాగోబా ఆలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే



నిజాంసాగర్, ఫిబ్రవరి 2: ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లిలో శుక్రవారం నిర్వహించిన తెలంగాణ పునర్ నిర్మాణ సభకు రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సభకు హాజరైన జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు కేస్లాపూర్‌లోని గిరిజనుల ఆరాధ్య దైవం నాగోబా ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కిసాన్ మేళాకు తరలిన రైతులు



కిసాన్ మేళాకు తరలివెళ్లిన రిలయన్స్ ఫౌండేషన్ రైతులు

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి2: హైదరాబాద్ హైటెక్స్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించిన కిసాన్ ఎక్స్‌పో మేళాకు శుక్రవారం బిచ్కుంద, మద్నూర్ మండలాలకు చెందిన సుమారు 60 మంది రైతులు తరలివెళ్లినట్లు రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి ముకుంద్ తెలిపారు. బిచ్కుంద, మద్నూర్ రెండు మండలాలకు చెందిన రైతులు ఈ ఎగ్జిబిషన్ కార్యక్రమంలో పాల్గొని వ్యవసాయ రంగంలో సహకరించే నూతన యంత్రాలను పరిశీలించారని తెలిపారు. వివిధ కంపనీలకు చెందిన యంత్రాలు ప్రదర్శించడంతో రైతులు ఆ యంత్రాలను ఆసక్తిగా తిలకించినట్లు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో ఆయా కంపెనీలకు చెందిన ప్రతినిధులు యంత్రాల వినియోగం తదితర సమాచారం రైతులకు వివరించడం జరిగిందని తెలిపారు.

ఫిజియోథెరపీ పరీక్షలు

నిజాంసాగర్, ఫిబ్రవరి 2: నిజాంసాగర్ మండల కేంద్రంలో మండల విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం ఫిజియోథెరపి ఏర్పాటు చేశారు. శిబిరంలో వైద్యులు అరుణ్ కుమార్ అత్యవసరాలు గల 8 మంది పిల్లలకు చికిత్సలు నిర్వహించారు. ప్రతిరోజు ఇంటి వద్ద తమ పిల్లలకు చేయించాల్సిన వ్యాయామాలు ఏ విధంగా చేయించాలి అనే వాటిపై వారి తల్లిదండ్రులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ రాజు, ఐఈ ఆర్పీలు సాయిలు, సునీల్, కార్యాలయ సిబ్బంది పంచాక్షరి తదిరులున్నారు.

గ్రామాభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలి

భిక్కనూరు, ఫిబ్రవరి 2: గ్రాభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని మండలంలోని సిద్దరామేశ్వరనగర్ గ్రామ ప్రత్యేక అధికారి, మండల పశువైద్యాధికారి దేవేందర్ కోరారు. బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేక అధి కారిని శుక్రవారం మాజీ సర్పంచ్ జనగామ శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి సౌజన్య సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామస్థులు గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, ప్రతిఒక్కరు ఇంటి పన్నులను చెల్లించాలని సూచించారు.



నాగిరెడ్డిపేటలో విద్యుత్ మీటర్‌ను పరిశీలిస్తున్న డీఈ గణేష్

ఎల్లారెడ్డి డివిజన్‌లో విద్యుత్ బకాయిలు రూ.15.22 కోట్లు

● ఎల్లారెడ్డి విద్యుత్ శాఖ డీఈ గణేష్

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 2: ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలో 15.22 కోట్ల రూపాయలు విద్యుత్ బకాయిలు ఉన్నట్లు ఎల్లారెడ్డి విద్యుత్ శాఖ డీఈ గణేష్ తెలిపారు. విద్యుత్ బకాయిల వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. నాగిరెడ్డిపేట మండలంలో బకాయిల వసూళ్ల కోసం శుక్రవారం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, లింగంపేట, గాంధారి మండలాలలో 15 కోట్ల 22 లక్షల రూపాయల విద్యుత్ బకాయిలు ఉన్నట్లు తెలిపారు. ఎల్లారెడ్డి మండలంలో రూ.4.53 కోట్లు, గాంధారి మండలంలో రూ.4.82 కోట్లు, లింగంపేట మండలంలో రూ.4.18 కోట్లు, నాగిరెడ్డిపేట మండలంలో రూ.1.67 కోట్లు బకాయిలు ఉన్నట్లు ఆయన తెలిపారు. ప్రతినెల డివిజన్ పరిధిలో రూ.2.07 కోట్లు విద్యుత్ బిల్లులు వసూలు చేయాల్సి ఉందన్నారు. గత నెల జనవరిలో రూ.1.87 కోట్లు వసూలు చేసినట్లు ఆయన తలెఇపారు. విద్యుత్ బిల్లులు, బకాయిల వసూళ్ల కోసం డివిజన్‌లోని అన్ని మండలాలలో సిబ్బంది ద్వారా స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలని ఆయన కోరారు. బకాయిలు చెల్లించని వినియోగదారులకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఈ మనోరంజన్, లైన్ ఇన్‌స్పెక్టర్ సురేందర్, లైన్‌మెన్ శశికాంత్, సిబ్బంది ఉన్నారు.

రోడ్డు నియమాలు పాటించండి



గ్రామస్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 2: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వాహనదారులు రహదారిపై ప్రయాణం చేసేటప్పుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్‌ఐ కోనారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని జగన్నాథపల్లి గ్రామం వద్ద ప్రజలకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతు రహదారిపై వాహనదారులు ప్రయాణం చేసే సమయంలో తమకు కేటాయించిన లైన్‌లోనే వెల్లాలని సూచించారు. వాహనాలకు సంబంధించిన ధృవపత్రాలు వెంట ఉంచుకోవాని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనం నడపాలని సూచించారు. దీంతో పాటుగానే ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఫోన్ ద్వారా ఎమరైనా ఓటిపి వచ్చిందని సమాచారం అడిడితే చెప్పరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ రాములు, సిబ్బంది సాయిశివ, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి

భిక్కనూరు, ఫిబ్రవరి 2: ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సూచించారు. శుక్రవారం భిక్కనూరు రైతువేదికలో లబ్ధిదారులకు మంజూరైనా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భిక్కనూరు మండలంలో 22మందికి మంజూరైనా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ శివప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ అనూష, ఆయాగ్రామాల ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించడమంటే రిజర్వేషన్లను వ్యతిరేకించడమే'

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 2: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించడమంటే రిజర్వేషన్లను వ్యతిరేకించడమేనని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ అన్నారు. శుక్రవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో అణిచివేతకు గురైన దళిత వర్గాలకు చేయూత నివ్వడం కోసం రిజర్వేషన్లను కల్పించబడ్డాయని తెలిపారు. అలా రిజర్వేషన్లు కల్పించడం వల్ల సమాజంలో చీలిక తీసుకువచ్చినట్లు కాదని అన్నారు. అణిచివేతకు గురైన దళితుల్లో మరింత అణిచివేతకు గురవుతున్న మాదిగల కోసం వర్గీకరణ డిమాండ్ ముందుకు వచ్చిందని అన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించడం అంటే ఎస్సీ రిజర్వేషన్లను వ్యతిరేకించడమే అవుతుందని అన్నారు. కొంతమంది ఎస్సీ వర్గీకరణతో దళితుల మధ్య చీలిక వస్తుందని దుష్పచారం చేయడం సరైంది కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ శివకుమార్, నాయకులు పద్మారావు మాదిగ, లక్ష్మీ, బాలరాజు, సాయి, విజయ్, శంకర్, సుమలత, లలిత, లత, యాదన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోవిందు నరేష్ మాదిగ

గ్రామ పంచాయతీ స్థలంపై ఆందోళన



రాస్తారోకో నిర్వహిస్తున్న గ్రామస్థులు

గాంధారి, ఫిబ్రవరి 2: గాంధారి మండలంలోని పొతంగల్ కుర్దు గ్రామంలో గ్రామ పంచాయతీ స్థలం విషయమై శుక్రవారం గ్రామస్థులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కోసం గ్రామస్థులు పనులు చేపడుతామని చూడగా పొతంగల్ గ్రామానికి చెందిన కిషన్‌రావు అనే వ్యక్తి ఆ స్థలం నాదేనని జీపీ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. దీంతో గ్రామస్థులు రోడ్డుపైకి వచ్చి స్థలం గ్రామానిదేనని 1985లో 7 గుంటలు గ్రామ పంచాయతీ కోసం కొనుగోలు చేశారని అన్నారు. ఈ స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారని కిషన్‌రావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ స్థలం గ్రామ పంచాయతీకి ఇవ్వకుంటే గ్రామంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు ధర్నాలో పాల్గొన్నారు. ధర్నా విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడి చేరుకుని గ్రామస్థులతో మాట్లాడడంతో వారు ధర్నా విరమించారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి		బాన్సువాడ	
దర్శన్	హనుమాన్	మహేశ్వరి	సైంధవ్
శాంతి	గుంటూరు కారం	వెంకటేశ్వర	నా సామిరంగ
ప్రియా 70	అంబాజీపేట మ్యారేజ్		
ప్రియా 35	కిస్మత్		

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	100	160	180
వెన్‌కాబ్(కిలో)	100	180	210



CLASSIFIEDS

పాస్‌పోర్టు పోయినది

Korapally Venkata Laxma Reddy S/o K. Linga Reddy, R/o H.No.11-1-890, New NGO's Colony, Subashnagar, Nizamabad యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం.F1366265 మా ఇల్లు NGO's Colony నుండి రైతుబజార్‌కు Xerox కొరకు వెళ్ళుమార్గములో పడిపోయినది. దొరికినవారు ఈ క్రింది నెం. 9494557172 కు తెలుపగలరు.

AJZ

CHANGE OF NAME

I, KAMTAM JAVEEN KUMAR (OLD NAME) R/O H.NO: 4-3, MENDHORA, BHEEMGAL, NIZAMABAD T.S. I HAVE CHANGED MY NAME AS KAMTAM JEEVAN KUMAR (NEW NAME) S/O KAMTAM LIMBADRI

AJZ



పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

-: సంప్రదించవల్సిన నెంబరు :-

కామారెడ్డి : 9985411453